క్లుప్తంగా

రికార్డులు నమోదు చేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీవో

కెరమెరి: రికార్డులు సరైన విధంగా నమోదు చేయాలని ఎంపీవో అంజద్ పాషా అన్నారు. మంగళవారం మండలంలోని సుర్దాపూర్ గ్రామపంచాయతీని సందర్శించారు. గ్రామ పంచాయతీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ప్రతీ నెల చెల్లించాలని, ట్రాక్టర్, విద్యుత్ బకాయిలు ఉండకుండా చూడాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. మొక్కలు చనిపోకుండా రక్షించాలని, ప్రతీరోజు మూడుసార్లు నీళ్లు పోయాలని పేర్కొన్నారు.

23న ఆదివాసీ గూడేల్లో జెండావిష్కరణ

జైనూర్: ఇటీవల మండల కేంద్రంలో జరిగిన ఘర్షణలకు నిరసనగా ఈనెల 23వ తేదీన ఆదివాసీ గూడేల్లో జెండాఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించాలని రాయిసెంటర్ తీర్మానించినట్లు ఆదివాసీ నాయకులు తెలిపారు. ఘర్షణకు పాల్పడిన అల్లరి మూకలపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాయిసెంటర్ తీసుకున్న పలు డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని పోలీసు ఉన్నతాధికారులకు అందించారు. 1ఆఫ్70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఘర్షణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు ఆదివాసీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాయిసెంటర్ సార్మేడీలు, గ్రామ పటేళ్లు, దేవారీలు, ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కౌటాల: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు కౌటాల మండల అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ అధ్యక్షతన మండల సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సమావేశానికి తమ శాఖల నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

తలమడుగు: మండలంలోని బరంపురం సమీపంలోని కొండపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామివారి కల్యాణ తంతు జరిపించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు చేర్లపల్లి, సకినాపూర్, నందిగామ, అర్లి, తలమడుగు, దేవాపూర్ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కేదారేశ్వర్‌రెడ్డి, మల్లేశ్, రంజిత్‌రెడ్డి, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆటలతోనే సంపూర్ణ ఆరోగ్యం

నేరడిగొండ: ఆటలు ఆడడం ద్వారా శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసంగా ఉంటారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో నేరడిగొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతోనే స్నేహ సంబంధాలు పెరుగుతాయని పేర్కొన్నారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

ఇచ్చోడ: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కొన్నేళ్లుగా ఇచ్చోడలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న వారిని అభినందించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

తలమడుగు: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామలలో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం పనులు చేపట్టాలన్నారు. ఏపీవో మేఘమాల, సిబ్బంది ఉన్నారు.

గంజాయి మత్తు.. యువత చిత్తు!





గత ఏప్రిల్ 16వ తేదీన జిల్లాలోని జైనూర్ మండలం గౌరీ కొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంరావు తన ఇంట్లో ఎండు గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు జైనూర్ పోలీసులు సోదాలు చేసి మూడు కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న భీంరావుపై కేసు నమోదు చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో జోరుగా గంజాయి గుప్పుమంటుందనే ఆరోపణలున్నాయి.

- పల్లెలకు విస్తరిస్తున్న గంజాయి
- బానిసలుగా మారుతున్న యువత
- మైనర్లు సైతం ఇదే దారిలో..
- ఆందోళనలో బాధిత కుటుంబాలు, తల్లిదండ్రులు
- ఇటీవల రూ.2 లక్షల విలువైన గంజాయి పట్టివేత

కౌటాల: నిన్న, మొన్నటి వరకు పట్టణాలు, నగరాలకు మాత్రమే పరిమితమైన డ్రగ్స్, గంజాయి కల్చర్ మెల్లమెల్లగా పల్లెలకు విస్తరిస్తోంది. జిల్లాలో గంజాయి విక్రయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. యువతే టార్గెట్‌గా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయి. సిగరెట్లలో గంజాయి పౌడర్‌ను నింపి విక్రయిస్తూ.. యువకులను మత్తులో ముంచుతున్నారు. పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా పూర్తిగా నియంత్రించలేకపోతున్నారు. దీంతో యువత తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

రెండు నెలల్లో 9 కేజీలు స్వాధీనం..

అక్రమార్జనకు అలవాటు పడిన కొందరు అక్రమార్కులు దొడ్డిదారిన గంజాయి పంటలను సాగు చేస్తున్నారు. యువతకు సరదా కోసం గంజాయి అలవాటు చేస్తున్నారు. సెలబ్రెటీల నుంచి సాధారణ జనాల వరకు బానిసలుగా మారుతున్నారు. జిల్లాలో గంజాయి ప్రియులు, విక్రయించే వారు పట్టుబడడం జిల్లాలో నిత్యకృత్యంగా మారింది. గ్రాముల్లో మొదలైన అక్రమ వ్యాపారం ప్రస్తుతం కిలోల కొద్దీ విక్రయించే స్థాయికి చేరిందంటే అతిశయోక్తి కాదు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నా వీటికి అడ్డుకట్ట పడడం లేదు. జిల్లాలో గత రెండు నెలల్లో రూ.2,40,140 విలువైన 9.588 కేజీల గంజాయి, 14 గంజాయి మొక్కలను పోలీసులు పట్టుకున్నారు.

సరదాగా మొదలై..

సరదాగా మొదలవుతున్న గంజాయి మత్తు వ్యసనంగా మారి జీవితాలను హరిస్తోంది. జిల్లాలో ఎంతోమంది మత్తు పదార్థాలకు బానిసలువుతున్నారు. ఇంట్లో నుంచి డబ్బులు దొంగిలించి మరీ వీటిని కొనుగోలు చేసే స్థితికి దిగజారారు. కొంత మంది యువత దగ్గర డబ్బులు లేకపోవడంతో తల్లిదండ్రులకు అనుమానం రాకుండా ఇళ్లల్లోనే గంజాయి మొక్కలు పెంచుతున్నారు. గంజాయి సేవిస్తున్న యువత ఒక గ్రూపుగా ఏర్పడి.. సరుకు ఎక్కడ అందుబాటులో ఉందనే సమాచారాన్ని చేరవేసుకుంటున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు చేరుకొని అక్కడ ప్రత్యేక గదుల్లో కొంతమంది కలిసి గంజాయి సేవిస్తున్నారు. గంజాయి విక్రయదారులు అధికారుల కంట పడకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. కొత్తవారికి కాకుండా రెగ్యులర్ కస్టమర్లకే విక్రయిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



యువత మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో గమనించాలి. జిల్లాలో గంజాయి సాగు నిర్మూలన కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాం. ప్రజల్లో మత్తు పదార్థాల అంశాలపై నాటక ప్రదర్శనలతో చైతన్యం తీసుకొస్తున్నాం. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాం. గంజాయిని పూర్తిగా రూపుమాపేందుకు పాటుపడుతున్నాం. గంజాయిని సాగు చేస్తే పీడీ యాక్టు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– కరుణాకర్, డీఎస్పీ, కాగజ్‌నగర్

పత్తిలో అంతర పంటగా..

జిల్లాలోని మారుమూల గ్రామాల్లో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నారు. అక్రమార్కులు అమాయక రైతులకు డబ్బు ఆశ చూపి ప్రోత్సహిస్తున్నారు. దీనిని అరికట్టేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా దందా కొనసాగుతుంది. పత్తి, ఇతర పంటల్లో ఏటా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నారు. జిల్లా సరిహద్దు గ్రామాల్లో సాగైన గంజాయిని ఎండబెట్టిన అనంతరం ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, జైనూర్, కెరమెరి, వాంకిడి, తిర్యాణి మండలాల్లోని పలు గ్రామాల్లో గంజాయి సాగు చేస్తున్నారు.

'ఐటీ రిటర్న్స్ సవరణకు అవకాశం'

రెబ్బెన: గత ఆర్థిక సంవత్సరాల ఐటీ రిటర్న్స్ కోసం తప్పుడు పత్రాలు సమర్పించి రిటర్న్స్ పొందిన సింగరేణి ఉద్యోగులకు ఐటీ రిటర్న్స్ సవరణకు ఆదాయపు పన్ను శాఖ ఒక అవకాశాన్ని కల్పించిందని సింగరేణి బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. 2021 –22, 2022 –23 ఆర్థిక సంవత్సరాల్లో సింగరేణి ఉద్యోగులు ఆదాయపు పన్ను రిటర్న్స్ కోసం ట్యాక్స్ కన్సల్టెన్సీల ప్రలోభాలకులోనై తప్పుడు పత్రాలు అందించి రిటర్న్స్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆదాయపు పన్ను శాఖ అధికారులు సింగరేణి దృష్టికి తీసుకొచ్చారన్నారు. దాంతో తప్పుడు పత్రాలు అందించి అదాయపు పన్ను మినహాయింపు పొందిన ఉద్యోగులు సరైన పత్రాలు సమర్పించి రిటర్న్స్‌ను సరి చేసుకోవటానికి ఐటీ శాఖ అవకాశం కల్పించిందని, ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సవరణ చేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో ఐటీ శాఖ విచారణ అనంతరం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

పంటల సాగుపై అవగాహన

తిర్యాణి: మండలంలోని నాయకపుగూడ గ్రామంలో ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయ నిర్వహణపై మంగళవారం వ్యవసాయ అధికారులు సంచార వాహనంలోని ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి తిరుమలేశ్వర్ మాట్లాడుతూ వరి సాగులో మేలైన పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చన్నారు. రైతులకు సాగులో ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకొచ్చి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రవణ్, సాగర్, ఆదిత్య తదితరులు ఉన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

పెంచికల్‌పేట్: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెంచికల్‌పేట్ ఇన్‌చార్జి ఏవో రాజులనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాపాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సుతో రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలన్నారు. ఒక్కో బ్యాగు రెండున్నర ఎకరాలకు సరిపోతుందని రైతులు రూ.1116 చెల్లించాలన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన విలేకరి అంగల తిరుపతిపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చారిగాం గ్రామశివారులో అక్రమ మైనింగ్ నిర్వాహకులు ఆయనపై విచక్షణరహితంగా దాడిచేయడం సరికాదన్నారు. పోలీసులు తక్షణమే అక్రమ మైనింగ్ నిర్వాహకుడు ఖలీంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, అశోక్, విశ్వేశ్వర్‌రావు, వీరభద్రచారి, శ్రీదేవి, దెబ్బటి శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

వినతిపత్రాలు అందజేత

కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన జర్నలిస్టు అంగల తిరుపతిపై దాడి చేసిన అక్రమ మైనింగ్ నిర్వాహకుడు ఖలీంపై కఠిన చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, ఆర్డీవో సురేశ్‌లకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు.

ప్రతి ఒక్కరూ దాడిని ఖండించాలి

జర్నలిస్టు తిరుపతిపై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు పేర్కొన్నారు. నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా అక్రమ మైనింగ్ విచ్చలవిడిగా కొనసాగుతుందని ఆరోపించారు. సీపీఐ(ఎం) సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు ఆనంద్, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు రాజయ్య, ఓదెలు, నర్సయ్య, జయదేవ్ అబ్రహం, నాగేశ్వర్‌రావులు దాడిని ఖండించారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

దహెగాం: కాగజ్‌నగర్‌కు చెందిన ఓ దినపత్రిక విలేకరుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల పాత్రికేయులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కవితకు, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాలు అందజేశారు. మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ప్రవీణ్‌గౌడ్, ముఖషీర్ పాషా, బుడిపెల్లి వెంకన్న, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: అక్రమంగా మట్టి తవ్వకాలపై వార్త సేకరణ కోసం వెళ్లిన జర్నలిస్టు తిరుపతిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామిల్ల సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

పెంచికల్‌పేట్: వార్తా సేకరణకు వెళ్లిన తిరుపతిపైన దాడి చేసిన నిందితులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు.

వైభవంగా బొమ్మల పెళ్లి


తాటిపల్లిలో బొమ్మల పెళ్లి చేస్తున్న చిన్నారులు

కౌటాల: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని కౌటాల మండలం తాటిపల్లి గ్రామంలో బొమ్మల పెళ్లి వేడుక వైభవంగా జరిగింది. చిన్నారులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించి వివాహ తంతు పూర్తి చేశారు. అతిథులుగా హాజరైన వారికి పిల్లలే భోజనాలు ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్ర సరిహద్దు సమీపంలోని తెలంగాణ గ్రామాల్లో మహారాష్ట్ర సాంస్కృతిక, సంప్రదాయాలను పాటిస్తుంటారు. ఏటా ఈ ప్రాంతంలో చిన్నారులు బొమ్మల పెళ్లిళ్లు చేస్తుంటారు. ఈనేపథ్యంలో తాటిపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం బొమ్మల పెళ్లి చేశారు. స్థానిక హనుమాన్ ఆలయం ఆవరణలో పిల్లలు పెళ్లి కూతురు, పెళ్లికొడుకు బొమ్మలకు ముస్తాబు చేసి వివాహం జరిపించారు. మరాఠీ సాంప్రదాయమైన గణపతి గజముఖం, మంగళాష్టకాలను చదువుతూ చిన్నారులు వివాహంలో పాల్గొన్నారు. అనంతరం వివాహానికి హాజరైన పెద్దలకు, అతిథులకు చిన్నారులు విందును సైతం ఏర్పాటు చేశారు. ఈ వివాహ తంతు నిర్వహణకు చిన్నారులే డబ్బులు జమ చేసుకొని ఖర్చు భరించడం విశేషం.

తేలిన కంకరతో తిప్పలు

- సరిహద్దు గ్రామాలకు రోడ్డు వేసిన మహారాష్ట్ర ప్రభుత్వం
- ఏడాది గడవకముందే అధ్వానంగా మారిన వైనం
- ఇంతవరకు రోడ్డు నిర్మాణం చేపట్టని తెలంగాణ సర్కార్
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


నారాయణగూడ వద్ద రోడ్డుపై లేచిన కంకర


ముకదంగూడ వద్ద..

కెరమెరి: ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక సరిహద్దు గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసిన మహారాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేసింది. నిర్మించి ఏడాది కూడా గడవక ముందే రోడ్డుపై కంకర తేలి నడిచేందుకు కూడా యోగ్యంగా లేకుండా అధ్వానంగా మారింది. ఇది తెలంగాణ –మహారాష్ట్ర సరిహద్దులోని పరంధోళి నుంచి మహరాజ్‌గూడ వరకు నిర్మించిన బీటీ రోడ్డు దుస్థితి. అయితే తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆయా గ్రామాల్లో ఇంతకరకు రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం గమనార్హం.

అధ్వానంగా రోడ్డు..

పరంధోళి, ముకందగూడ, మహారాజ్‌గూడ గ్రామాల మీదుగా గతేడాది మహారాష్ట్ర ప్రభుత్వం రూ. కోటికి పైగా వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపట్టింది. నాణ్యతగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టక పోవడంతో ఎక్కడికక్కడ కంకర లేచింది. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఏడాది గడవక ముందే రోడ్డు గుంతలతో, కంకర లేచి అధ్వానంగా మారింది. అయితే ఏళ్లుగా తెలంగాణ ప్రభుత్వం ఆయా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రిజర్వ్ ఫారెస్టు అంటూ తెలంగాణ అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే భోలాపటార్ మీదుగా నారాయణ గూడ, అంతాపూర్, పద్మావతి, ఏసాపూర్, ఇంద్రానగర్‌కు నాలుగేళ్ల కిత్రం వేసిన రోడ్డు పరిస్థితి కూడా అధ్వానంగానే ఉంది. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు కృషి చేయాలని, సరిహద్దు గ్రామాలకు రోడ్లు మంజూరు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

భక్తులు వెళ్లే మార్గం..

ప్రసిద్ధిగాంచిన ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులు రాళ్ల రప్పలతో ఉన్న రోడ్డుపై నడిచి వెళ్లేవారు. అయితే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో రవాణా సౌకర్యం మెరుగుపడిందని వారు హర్షం వ్యక్తం చేశారు. కానీ ఏడాది గడవక ముందే రోడ్డు అధ్వానంగా మారింది. ప్రతీ ఏడాది డిసెంబర్, మే మాసాల్లో జంగుబాయి ఆలయంలో నెలరోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయి. ఆయా మాసాల్లో భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.

మరమ్మతులు చేపట్టాలి



పరంధోళి నుంచి ముకందగూడ వరకు నిర్మించిన రోడ్డుపై కంకర లేచి అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు ప్రారంభమైతే ఉన్న బీటీ కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– కాంబ్లె లక్ష్మణ్, మాజీ సర్పంచ్, పరంధోళి

యూనిఫామ్ క్లాత్ పంపిణీ

కెరమెరి: గడిచిన రెండు రోజులుగా మండలంలోని ఆయా వీవో సభ్యులకు క్లస్టర్ల వారీగా ఇచ్చిన యూనిఫామ్ క్లాత్‌ను మంగళవారం ఐకేపీ సీసీలు ధన్‌రాజ్, శ్యాంరావులు సంఘ సభ్యుల సహాయంలో ఆయా పాఠశాలలకు కత్తిరించి అందజేశారు.


క్లాత్ కొలుస్తున్న సీసీ ధన్‌రాజ్

'గౌడ కులస్తులకు దక్కిన గౌరవం'

కెరమెరి: ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్‌లో జనగామ జిల్లా పేరును సర్దార్ పాపన్న గౌడ్ జిల్లాగా నామకరణం చేస్తామని ప్రకటించడం రాష్ట్రంలోని గౌడ కులస్తులకు దక్కిన గౌరవమని మోకుదెబ్బ మండల అధ్యక్షుడు పందీర్ల సంజీవ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నర్సాగౌడ్‌లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గౌడ కులస్తుల ఇతర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

రేపు శ్రీనివాసుని కల్యాణోత్సవం

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని శ్రీ రమా సత్యనారాయణస్వామి ఆలయం (మంగమతం)లో ఈనెల 23న స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈవో వామన్‌రావు, ఆలయ ప్రధాన అర్చకుడు వైభవ్ దూబే శర్మ పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899